క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణంలో మంగళవారం విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీ చేశారు. స్థానిక బిస్మిల్లా ట్రేడర్స్‌లో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత దుకాణ యజమాని ప్రభుత్వ అనుమతులు పొందకుండా, సరైన ఇన్వాయిస్‌లు లేకుండా, రైతులు తీసుకున్న ఎరువుల బస్తాలకు రసీదులు ఇవ్వడం లేదని తేల్చారు. దుకాణంలో ఎరువుల విక్రయాలకు సంబంధించి రికార్డులు సైతం సక్రమంగా నిర్వహించలేదని అధికారులు గుర్తించా రు. అధికారులు మాట్లాడుతూ, దుకాణంలో రికార్డులు సక్రమంగా లేకపోవడంతో పాటు అనధికారంగా నిల్వ ఉంచిన 200 బస్తాల ఎరువులను సీజ్ చేశామన్నారు. ఎరువుల బస్తాల విలువ రూ.1.35 లక్షలు ఉంటుందన్నారు. దుకాణం లైసెన్స్‌ను రద్దు చేసేందుకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ వ్యవసాయాధికారి రామాంజనేయరెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ వెంకటరమణ, ఏఓ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఎన్టీఆర్ అభిమానులు

కాణిపాకం: కాణిపాకంలో మంగళవారం జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఆ అభిమానులు ఘనంగా నిర్వహించారు. సినిమా థియేటర్ వద్ద కేక్ కట్ చేసి అన్నదానం, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభిమానులు పవన్‌కుమార్, అనీష్, రాజేష్, సతీష్, విక్రమ్, నాని, నవీన్, సాయి, వినాయక తదితరులు పాల్గొన్నారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు



దిగువమత్యంలో మహిళలకు వైద్యం చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: పల్లెల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని దిగువమత్యంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 32 మందికి వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై లింగ వివక్ష వద్దు



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ నిర్మల

తవణంపల్లె: ఆడపిల్లలపై లింగ వివక్ష చూపరాదని ఐరాల సీడీపీఓ నిర్మల తెలిపారు. దిగువ తడకర, బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఆడపిల్లల లింగ వివక్ష, అసమానతలపై కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ నిర్మల మాట్లాడుతూ లింగ వివక్ష, ఆడిపిల్లల భ్రూణ హత్యలు, శిశు హత్యలు, అసమానత, అక్షరాస్యత రేట్లు, ఆరోగ్య, లింగ అసమానతలను వివరించారు. కౌమార దశలో ఆడ పిల్లలు అవగాహనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

చిత్తూరు అభివృద్ధికి నిధులు అడుగుదాం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి భారీ మొత్తంలో నిధులు తీసుకురావాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు అన్నారు. ఈ నెలతో నిర్వహించనున్న టీడీపీ మహానాడులో దీనిపై చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహించారు. చిత్తూరులో రోడ్ల అభివృద్ధి, విశ్వవిద్యాలయం, వైద్య కళాశాలతోపాటు ఇతర అభివృద్ధి పనుల కోసం భారీ మొత్తంలో నిధులు అవసరమవుతాయని ఎమ్మెల్యే అన్నారు. దీనిపై సీఎం చంద్రబాబుతో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో టీడీపీ నేతలు దొరబాబు, చంద్రప్రకాష్,సీకేబాబు హేమలత పాల్గొన్నారు.

పూతలపట్టులో గంగజాతర

పూతలపట్టు(కాణిపాకం): పూతలపట్టులో మంగళవారం గంగజాతర అట్టహాసంగా ప్రారంభమైంది. ఉదయం తొలిపూజ చేసి వంశపారంపర్య ధర్మకర్త జగదీశ్వర్‌రెడ్డి, హరిత రెడ్డి కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. గజమాల సమర్పించి హారతులు పట్టారు. సాయంత్రం కుంభ సమర్పణ చేశారు. రాత్రి వీధినాటక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ జాతరలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అమ్మవారికి పూజ చేస్తున్న జగదీశ్వర్‌రెడ్డి

గుడిపాల: కోటూరు భక్తులకు దర్శనమిస్తున్న కరుమారియమ్మ, వసంతాపురంలో అంబలి తీసుకువెళ్తున్న మహిళలు , 197రామాపురంలో గంగమ్మ తల్లి







ఊరూరా జాతర

జిల్లాలో గంగజాతర్ల సందడి మొదలైంది. మే నెల రెండో వారం నుంచి నిర్వహిస్తున్న అమ్మవారి జాతర్లలో గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. మండే ఎండలకు ఉపశమనంగా అంబలి సమర్పించడం, పొంగళ్లు నైవేద్యం పెట్టడం ఈ జాతర సంప్రదాయం. జంతుబలులు, అమ్మవారి విగ్రహాల ఊరేగింపులు కూడా ఈ జాతర్లలో భాగమే. పలుచోట్ల వీధి నాటకాల ప్రదర్శన ప్రత్యేకతగా నిలుస్తోంది.

కొలువుదీరిన గంగమ్మ తల్లి

తవణంపల్లె: మండలంలోని ఎగువ తవణంపల్లెలో మంగళవారం నడివీధి గంగమ్మ కొలువుదీరారు. అమ్మవారి గరిగను ఊరేగించారు. గంగమ్మ తల్లికి ఉదయం అంబలి పోశారు. సాయంత్రం అమ్మ వారికి పొంగలి పెట్టి నైవేద్యం సమర్పించారు. రాత్రిలో పిండి వంటలతో మొక్కులు తీర్చుకొన్నారు.

జొన్నగురకలలో..

మండలంలోని జొన్నగురకల గ్రామంలో మంగళవారం గంగమ్మ తల్లికి భక్తితో అంబలి పోశారు. అనంతరం భక్తిప్రపత్తులతో భక్తులు పొంగళ్లు పెట్టారు. అమ్మ వారికి పసుపు, కుంకుమ, వేపాకు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.



ఎగువ తవణంపల్లెలో..

భువికి దిగి రావమ్మా.. గంగమ్మా!

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గంగమ్మా.. భువికి దిగిరావమ్మా.. మా కష్టాలను పారదోలవమ్మా అంటూ భక్తుల వేడుకోలుతో చిత్తూరు నగరం మార్మోగింది. నగరంలోని మూడవగేటు, ఇరువారం, మురుగానంపల్లి ప్రాంతాల్లో గంగజాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఇరువారం జాతరకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. తొలిపూజ చేసి తెరను తొలగించారు. ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి భక్తులు అంబలిని నైవేద్యంగా సమర్పించారు. రాత్రి వరకు పూజలు కొనసాగాయి. ఆయా మండపాల వద్ద భక్తులు అధిక సంఖ్యలతో తరలివచ్చి అమ్మవారికి చీరలు, కానుకలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అన్ని ప్రాంతాల్లోనూ బుధవారం నిమజ్జనం జరగనుందని జాతర పెద్దలు పేర్కొన్నారు.



మంగళసూత్రం చూపుతున్న విజయానందరెడ్డి

జాతర్ల కోలాహలం

గుడిపాల: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం గంగజాతర కోలాహలంగా సాగింది. వసంతాపురం, 197రామాపురం, గొల్లపల్లె, పల్లూరు, పల్లూరు ఆదిఆంధ్రవాడలో ఉదయం గంగమ్మ గుడివద్దకు మహిళలు ఊరేగింపుగా వెళ్లి అంబళ్లు పోశారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి కొబ్బరికాయలను కొట్టి అమ్మవారిని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారు పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి భక్తులకు దర్శనమిచ్చారు. కోటూరు గ్రామంలో కరుమారియమ్మ తిరుణాళ్లను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.



గంగజాతరలో అమ్మవారికి అంబలి సమర్పిస్తున్న మహిళలు

భక్తులతో పోటెత్తిన వజ్రాలపురం బోయకొండ



వజ్రాలపురం బోయకొండ గంగమ్మ

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయం మంగళవారం భక్త జనులతో పోటెత్తింది. అమ్మవారి జాతరలో భాగంగా రెండో రోజు గంగమ్మ భక్తులకు నిజరూప దర్శనంతో కనువిందు చేశారు. ఉదయం అమ్మవారికి అంబళ్లు, పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారి మూలవిగ్రహం, ఉత్సవ మూర్తులను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంక రించారు. ఎమ్మెల్యే మురళీమోహన్ అమ్మ వారికి కాణిపాకం దేవాలయం తరపున పట్టువస్త్రాలను సమర్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు, పరిసర గ్రామస్తులతోపాటుగా కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. బొమ్మాయిపల్లెకు చెందిన పారిశ్రామికవేత్త ఈశ్వర్‌నాయుడు, మమత ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, కార్యనిర్వాహకులు గోపి పురుషోత్తం, కమిటీ సభ్యులు శివలింగయ్య, బుస్సానాగరాజగౌడ్, రాజేంద్ర నాయుడు, రామ్మూర్తినాయుడు, సుబ్బానాయుడు, బుజ్జి, శంకరయ్య, మురళి, తులసీ. వేణుగోపాల్‌నాయుడు, ఆలయ మేనేజర్ మొగిలప్ప పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

మండల కేంద్రంలో మంగళవారం గంగమ్మజాతర మొదలైంది. ఉదయం అమ్మవారికి అంబళ్లు, సాయంత్రం పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం గ్రామ దేవత శ్రీముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. రాత్రి అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి బుధవారం వేకువజామున నడివేధిలో కొలువుదీర్చనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాలేరులో...

మండలంలోని పాలేరు గ్రామంలో సోమవారం రాత్రి అమ్మవారి శిరస్సును గ్రామంలో ఊరేగించి తెల్లవారుజామున నడివీధిలో కొలువుదీర్చిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అమ్మవారికి పూజలు చేసి దర్శించుకున్నారు. తుంబకుప్పంలో జాతర వేడుకగా నిర్వహించారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



పాలేరులో కొలువు దీరిన గంగమ్మ

వేసవి శిక్షణతో విద్యార్థులకు మేలు

ఐరాల: విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసి వారికి వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వడానికి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు మంగళవారం కథలు చెప్పడం, కంప్యూటర్, గణితంలో సులభ పద్ధతులు, గణిత చమత్కార మంజిరి, తెలుగు వ్యాకరణం తదితర అంశాల్లో మెలకువలు నేర్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేసినప్పుడే మంచి అలవాట్లు, నడవడిక, వినయ విధేయతలు అలవడుతాయన్నారు. చిన్నారులు ఈ వయసు నుంచే పుస్తకాలను చదవడం వలన గొప్ప ప్రయోజకులవుతారన్నారు. పిల్లలకు మంచి కథలు వినిపించడంతో పాటు మానసిక ఉల్లా సం కోసం డ్యాన్స్, ఆటల పోటీలు, డ్రాయింగ్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్


తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల ధర్నా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్న అరబిందో సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. విధుల్లో నుంచి తొలగించిన డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. అనంతరం డిమాండ్‌లు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు

మే పుష్పం



ప్రకృతి ప్రేమికులను అలరించే మే పుష్పం విరబూసింది. ఇది ఏప్రిల్లో మొగ్గ తొడిగి మేలో వికసిస్తుంది. ఐరాల మండలం దిగువ కామినాయనపల్లెకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మనోహర్, జయమ్మ దంపతుల ఇంటి ఆవరణలో అరుదుగా కనిపించే మే పుష్పం మంగళవారం వికసించింది. ఈ మొక్కను మద్రాసు నుంచి తెప్పించామని, ఐదేళ్లుగా మేలోనే పుష్పం వికసిస్తోందని తెలిపారు. – ఐరాల

కిశోరి వికాసం.. భవితకు పునాది

గుడిపాల: కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్‌కు పునాది వేస్తుందని శిశు సంక్షేమ అధికారి శివశంకర్ అన్నారు. ఆయన మంగళవారం 189కొత్తపల్లె, కిల్లారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కిశోర బాలికలు సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలను అసభ్య పదజాలంతో దూషించినా, ఫోన్‌లో మాట్లాడిన తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలని, క్షణికావేశాలకు గురై ఆత్మహత్యలకు పాల్పడవద్దని స్పష్టం చేశారు. బాలికలందరికీ రక్తహీనత, రుతుక్రమ పరిశుభ్రత నిర్వహణ, లైంగిక దాడులు, లింగ అసమానతలు, బాల్య వివాహాలపై వారికి విపులంగా వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ తోయాద్రాక్షి, అంగన్‌వాడీ టీచర్లు గౌరి, రాణి, నిర్మల పాల్గొన్నారు.



కిశోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న శివశంకర్

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి

గుడిపాల: గ్రామాల్లో అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని 104 వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. చిత్తపార గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. మురుగునీటి కాలువల్లో నీరు నిల్వలేకుండా చూడాలని, ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలు, లార్వాలు పెరగకుండా నివారించవచ్చన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు, గర్భవతులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్రశేఖర్, హేమలత, మంజుల, కోకిల పాల్గొన్నారు.



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ప్రవీణ్

చెరువులు.. మొరవలు



మొరవపోతున్న నక్కపల్లె చెరువు

పలమనేరు: కొన్నిరోజులుగా మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు చెరువులు మొరవెత్తుతున్నాయి. వాగులు, వంకలు పారుతున్నాయి. ఇక కర్ణాటక రాష్ట్రంలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కౌండిన్య నదికి నీరు చేరుతోంది. ఇప్పటికే మండలంలోని కాలువపల్లె వద్ద వైఎస్సార్ జలాశయం సగానికి పైగా నిండింది.

పలు చెరువులు మొరవ

మండలంలోని బొమ్మిదొడ్డి, నక్కపల్లె, బేలుపల్లె, ఎస్‌పురంలోని వడ్డెవానికుంట, గొల్లపల్లి బుచ్చిరెడ్డి చెరువు, ఎర్రగొండేపల్లె వస్తింపల్లె చెరువు, గంగారపూర్ చిన్నచెరువు మొదలైనవి ఈ వర్షాలకు మొరవెత్తుతున్నాయి. కొలమాసనపల్లె, మొరం, కరిడిమొడుగు తదితర చెరువులకు వరదనీరు చేరుతోంది. బూదాలవంక, చిన్నేరు, ఎరిగినేరు, కాలువపల్లె ఏర్లలో నీరు ప్రవహిస్తోంది.

కౌండిన్యలో మొదలైన ప్రవాహం

మండలంలో ప్రధాన నదిగా పేరున్న కౌండిన్యలోకి ఎగువ ప్రాంతాల నుంచి వర్షపునీరు చేరుతోంది. దీంతో వైఎస్సార్ జలాశయం జలకళ సంతరించుకుంటోంది. పట్టణానికి ప్రధాన నీటి ఆధారమైన ఈ జలాశం పూర్తిగా నిండితే పట్టణంలో నీటి సమస్య తప్పినట్టే.



ప్రవహిస్తున్న ఎరిగినేరు